క్లుప్తంగా

స్వధార్ హోమ్‌లో రొట్టెలు, పండ్లు పంపిణీ



తెనాలిటౌన్: పట్టణంలోని జేంఎంజే స్వధార్ హోమ్‌లో మంగళవారం మాజీ స్పీకర్ డాక్టర్ కొడెల శివ ప్రసాదరావు జయంతిని నిర్వహించారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి ఆధ్వర్యంలో కోడెల చిత్ర పటానికి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం.సీతారామయ్య రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అంగలకుదురు ఉప సర్పంచ్ కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, ఆలపాటి వెంకట్రామయ్య, విష్ణు, ఖాదర్, మన్నెం వాసుదేవరావు, నిజాం, ఎం.వెంకట సుబ్బయ్య, దాసరి సత్యనారాయణ, నిజాముద్దీన్, పొన్నం చిన్న పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం



తెనాలిటౌన్: పట్టణంలోని 28వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్ తండ్రి ప్రసాదరావు రెండో వర్ధంతి సందర్భంగా మంగళవారం చెంచుపేటలోని అనాథశ్రమంలో పిల్లలకు అన్నదానం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అనిల్, షేక్ నూర్ ఇస్మాయిల్, విలియమ్స్, ఉన్నవ సాల్మన్ సభ్యులు పాల్గొన్నారు.

వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



తెనాలిటౌన్: చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని మంగళవారం ప్రధానోపాధ్యాయులు కె.రాజారెడ్డి ప్రారంభించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జమ్ముల రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా శాప్ సహకారం, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీడీ రమేష్ తెలిపారు.

వృద్ధాశ్రమానికి ఎయిర్ కూలర్ వితరణ



తెనాలి: పట్టణలోని బుర్రిపాలెం రోడ్డులో ఉన్న శ్రీ మహాత్మా సేవా శాంతి ఆశ్రమానికి దాతలు ఎయిర్ కూలర్‌ను బహూకరించారు. నూరేళ్ల తెనాలి రంగస్థలి రచయిత నేతి పరమేశ్వర శర్మ కుమారుడు సీతారామరాజు, విశాలాక్షి దంపతులు మంగళవారం ఆశ్రమానికి ఈ కూలర్‌ను అందజేశారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు వజ్రాల రామలింగాచారి కృతజ్ఞతలు తెలియజేశారు.

అపార్ట్‌మెంట్ నుంచి పడి విశ్రాంత ఉద్యోగి మృతి



తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని చెంచుపేటలో విషాదం నెలకొంది. ఇక్కడి జెండా చెట్టు బజారుకి చెందిన విశ్రాంత ఉద్యోగి బల్లా రామారావు(75) మంగళవారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ నుంచి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావుకు భార్య, కుమార్తె, అల్లుడు ఉన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి స్థానికంగా ఓ అపార్ట్‌మెంటులో నివసిస్తున్నాడు. గతంలో మేడపాడులో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసిన రామారావు ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటున్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్‌పై కేసు నమోదు

తెనాలిరూరల్: మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడని ఓ యువకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్రామానికి చెందిన హరినాథ్ అతని ఇంటి సమీపంలో నివసించే మైనర్ బాలిక(ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాసి ఇంటి వద్ద ఉంటోంది) వెంట పడుతుండే వాడు. విషయం తెలుసుకున్న బాలిక తలిదండ్రులు యువకుడి కుటుంబ సభ్యులకు విషయం చెప్పారు. గత నెల 29న బాలిక ఇంటికెళ్లి హరినాథ్ ఆమెను తనతో పాటు తీసుకెళ్లాడు. బాలిక తల్లి ఫిర్యాదు చేయగా రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.

రాష్ట్రంలో పారదర్శక సంక్షేమ పాలన

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



మహిళలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవినీతికి ఆస్కారం లేకుండా మహా సంక్షేమ పాలనను అందిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గౌడకాలనీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని రెండో రోజు మంగళవారం నిర్వహించారు. గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో కలసి ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే శివకుమార్ ప్రజలకు అందించిన సంక్షేమ ఫలాల వివరాలను తెలియజేశారు. కనదుర్గ ఆలయం వద్ద గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామం నుంచి వెళ్తున్న తెనాలి పుర సంఘ డ్రెయిన్‌పై మూత ఏర్పాటు చేయాలని, రోడ్డు నిర్మించాలని స్థానికులు ఆయనకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) ద్వారా అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారు ఖాతాలోకి సంక్షేమ నగదును అందజేస్తున్నామని చెప్పారు. వెనుక బడ్డ కులాలను బ్యాక్ బోన్ కులాలుగా చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం బీసీ కులాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అత్యధిక బీసీ జనాభా కలిగిన జగ్గడిగుంట పాలెం గ్రామంలో 1,752 కుటుంబాలుండగా 772 కుటుంబాలకు పింఛన్ అందిస్తున్నట్లు వెల్లడించారు. వైఎస్సార్ చేయూత పథకం కింద 428 కుటుంబాలకు మూడేళ్లుగా లబ్ధి అందుతోందని, దీని ద్వారా గ్రామంలో వ్యాపరంలో మహిళ సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. 400 మందికి నివేశన స్థలాలు ఇవ్వడంతో పాటు 894 కుటుంబాలు సున్నా వడ్డీ ద్వారా లబ్ధి పొందాయని వివరించారు. గ్రామంలో రూ.15.71 కోట్ల సంక్షేమ కార్యక్రమాలు అందించినట్టు వివరించారు. అంతకు ముందు గౌడ కాలనీ కమ్యునిటీ హాలుకు శంఖు స్థాపన చేశారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కుంభం బాలాజీ, ఎంపీటీసీ కాజా భద్రావతి బాలాజీ, ఎంపీపీ చెన్ను బోయిన శ్రీనివాసరావు, వీవర్స్ సొసైటీ అధ్యక్షురాలు దామర్ల విజయరాణి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య, కాళిదాసు వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ ఆవుల కోటయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి భావనారుషి స్వామి కల్యాణోత్సవాలు



భద్రావతి సమేత భావనారుషి స్వామి

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో కొలువైన భద్రావతి సమేత భావనారుషి, మార్కండేయ ఈశ్వర భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి నాడు వైభవోపేతంగా నిర్వహిస్తారు. స్వామివార్ల కల్యాణ మహోత్సవాలు బుధవారం ప్రారంభంకానున్నాయి. తొలి రోజు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహ వచనం, అంకురార్పణ, ధ్వజారోహణ నిర్వహించనున్నారు. ఈ నెల 6వ తేదీ వరకు కల్యాణం మహోత్సవాలు జరుగుతాయని రెండు ఆలయాల నిర్వాహకులు తెలిపారు. గురువారం స్వామి వారి కల్యాణం, శుక్రవారం దివ్య రథోత్సవం జరగనున్నాయి. కాళవాసురుడు, మూలకాసురుడు అనే రాక్షసులు దేవదానవులను చిత్ర హింసలకు గురి చేస్తుంటే.. వారిని సంహరించడం కోసం 20 వేల మంది రుషులు చేసిన యజ్ఞ గుండం నుంచి అవిర్భవించిన 16 సంవత్సరాల బాలుడే భావనారుషిగా పురాణ ఇతిహాసాలు చెబుతున్నాయి. భావనారుషే మొట్ట మొదటిగా వస్త్రాలను సృష్టించి, ప్రపంచానికి అందిచాడనే నమ్మకం ఆయని సంతతివారైన పద్మశాలీయుల్లో ఉంది. తమకు జీవనోపాధిని కల్పించిన ఆ మహనీయుడిని తమ కులానికి మూల పురుషుడిగా భావిస్తూ పూజిస్తారు. స్వామి వారి ఉత్సవాలు పురస్కరించుకుని దేవాలయాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

చిన్నారి నర్తకులకు ఐరావతం, నంది పురస్కారాలు



పురస్కారాలతో బాలత్రిపుర సుందరి, శిష్యబృందం

తెనాలి: హైదరాబాద్‌కు చెందిన ఆదర్శ కళా నిలయం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అక్కడి త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ఐరావతం జాతీయ అవార్డు, ఆదర్శ స్వర్ణ నంది జాతీయ అవార్డు–2023లో తెనాలి చిన్నారులు నంది, ఐరావతం అవార్డులను అందుకున్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ నర్తకి, నృత్య గురువు డాక్టర్ చల్లా బాలత్రిపుర సుందరికి చెందిన కల్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ 30 మంది శిష్య బృందం వివిధ కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. కళా నిలయం అధ్యక్షుడు చేరాల ప్రకాష్, లలిత, ప్రముఖ సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, ఉపాధ్యక్షుడు, ప్రముఖ సినీ నటుడు మాణిక్, సినీ నటీనటులు జ్యోతిరెడ్డి, రాజేందర్, కుమనస్, బలగం ఫేమ్ సత్య ఏలేశ్వరం, కర్తానందం, ప్రముఖ జానపద పేరడి గాయని అరుణా సుబ్బారావు, ఆవునూరి నాగరాజుశర్మ తదితర పెద్దలు హాజరయ్యారు. ఇదే వేదికపై డాక్టర్ చల్లా బాలత్రిపురసుందరి దంపతులను కళా నిలయం అధినేత చేరాల ప్రకాష్ స్వర్ణ నంది, వెండి ఐరావతంతో ఘనంగా సత్కరించారు.

అసామాన్య శక్తి స్వరూపం

- కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం
- ఆదిపరాశక్తి ప్రతిరూపం చందోలు బండ్లమ్మ
- నేటి నుంచి అమ్మవారి వార్షిక తిరునాళ్ల



బండ్లమ్మ అమ్మవారు

చందోలు(పిట్టలవానిపాలెం): అమ్మలగన్న అమ్మ, అది పరాశక్తి ప్రతి రూపంగా కొలిచే భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తుల కొంగుబంగారం చందోలు బండ్లమ్మ. ఇక్కడ బావిలో అమ్మవారి విగ్రహం దొరకగా.. దేవాలయ నిర్మాణంలో ఆభరణాలు బయల్పడ్డాయి. ఎంతో చరిత్ర కలిగిన అమ్మవారి ఆలయ తిరునాళ్ల బుధవారం ఘనంగా ప్రారంభకానున్నాయి. మే 7 వరకు అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

వేడుకగా తిరునాళ్ల

మొదటి రోజు అఖండ జ్యోతితో తిరునాళ్ల ప్రారంభంకానుంది. తవ్వకాల్లో లభించిన బంగారు అభరణాలతో అమ్మవారిని మే 6న శనివారం అలంకరిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారని దేవాదాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇందుకు అవసరమైన బందోబస్తును పోలీసు శాఖ ఏర్పాటు చేయనుంది.

అభిషేక జలం ప్రత్యేకత..

చందోలు గ్రామంలో బగళాముఖి అమ్మవారు వెలిశారు. అమ్మవారు వెలిసిన బావి కాలగర్భంలో కలిసిపోయి ఆక్రమణకు గురయ్యి.. ఎక్కడ ఉందో తెలియలేదు. 2017లో అప్పటి ధర్మకర్తల మండలి చైర్మన్ దోమ నాగేశ్వరరెడ్డి, భక్తులు కలిసి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే చేసి పాత రికార్డుల ప్రకారం 15 రోజులు శ్రమించి భూ మట్టం నుంచి 13 అడుగుల లోతులో ఒక పురాతన జలాశయం వంటి బావిని కనుగొన్నారు. ప్రస్తుతం 45 అడుగుల చుట్టు కొలతతో 15 అగుల వెడల్పు, 28 అడుగులకు పైబడిన లోతులో అమ్మవారు బయల్పడిన జలాశయం దర్శనమిస్తుంది. ప్రతి రోజూ ఆ జలాశయ తీర్థమే అమ్మను అభిషేకించడానికి ఉపయోగిస్తున్నారు.

అసమాన్య శక్తి రూపం..

దశ మహా విద్యలో 8వ స్థానం కలిగినదే బగళాముఖీ శక్తి. కపాల మాలాంకృతురాలిగా, మకర కిరీట ధారిణిగా, అసుర వాహనంపై ఆసీనురాలై పాశం, స్తంభనాయుధం, అభయ హస్తం, పాన పాత్రలను ధరించి, కపాల యజ్ఞోపవీత ధారిణిగా ఉండే అసామాన్య రూపం బగళాముఖి శక్తి. అదే రూపంలో.. సూర్యచంద్రులు ఇరువైపులా ఉండగా, త్రినయనిగా చెవికి నాగము, కపాలం ధరించి, ఎడమ చెవికి వృత్తాకారంలో ఉన్న కర్ణాభరణం కలిగిన విగ్రహరూపం బగళాముఖి అని స్పష్టమవుతోంది. ఆధ్యాత్మిక శక్తి సంపన్నమైన ఈ స్థానంలో ఎందరో మునీశ్వరులు తపస్సు చేసి, అమ్మ సాక్షాత్కారం పొందారు. ఆధునిక కాలంలో చందోలు గ్రామాల శ్రీ విద్యోపాసకులుగా విరాజిల్లిన బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి అమ్మ శక్తులను ఎన్నో సార్లు భక్తులకు ప్రత్యక్షంగా చూపించారు. వీరి ఆధ్వర్యంలో 1972లో ఆలయ ఆవరణకు భక్తుల సహకారంతో ప్రహరీ నిర్మించారు. 2002లో దేవాదాయ శాఖ ఆలయ ముఖ మండప నిర్మాణానికి గుంతలు తీస్తుండగా కేజీ 467 గ్రాముల బరువు గల అమ్మవారి ప్రాచీన ఆభరణాలు బయల్పడ్డాయి. లభ్యమైన ఆభరణాల్లో అమ్మవారి వడ్డాణం, కమ్మలు, చెవి దిద్దులు, హారం, ముక్కు పుడక, మంగళ సూత్రాలు, కను బొమ్మలు ఉన్నాయి. పురావస్తు శాఖ కొన్ని వందల ఏళ్ల కిందటి బంగారు ఆభరణాలుగా వాటిని గుర్తించింది. అప్పటి నుంచి ఆ ఆభరణాలు బ్యాంకు లాకరులో భద్రపరిచి, రెవెన్యూ, పంచాయతీ రాజ్, పోలీసు, దేవాదాయ శాఖల అధికారుల సమక్షంలో తీసుకొచ్చి.. ఏటా అమ్మవారిని వార్షిక తిరునాళ్ల మహోత్సవంలో ఒక రోజు అలంకరించడం జరుగుతుంది.

అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం వల్లభాపురం వద్ద అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తన సిబ్బందితో మంగళవారం గుర్తించి, యజమానికి రూ. 8 వేల జరిమానా విధించారు.

దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు

మంగళగిరి: మద్యం మత్తులో ముగ్గురు యువకులు రాళ్లతో ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... తుళ్లూరు మండలం వెంకటపాలెం గ్రామానికి చెందిన పులి కిరణ్ అలియాస్ ఉదయ్‌కుమార్ నగరంలోని రాయల్ గ్యాస్ కంపెనీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం రాత్రి గుంటూరు నుంచి సిలిండర్ల లోడు లారీలో నగరంలోని ఆర్టీసీ డిపో రోడ్డులో గల గ్యాస్ గోడౌన్‌కు రాగా అదే సమయంలో రోడ్డుపై కూర్చొని మద్యం సేవిస్తున్న పాత మంగళగిరికి చెందిన డి వెంకటేష్ అలియాస్ నాని తన ఇద్దరు స్నేహితులతో కలసి కిరణ్‌పై రాళ్లతో దాడికి పాల్పడగా గాయాలయ్యాయి. బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసుపు రైతులు సంఘటితం కావాలి

తాడేపల్లిరూరల్ : దేశవ్యాప్తంగా పసుపు పండిస్తున్న రైతులందరూ ఏకమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి మద్దతు ధర వచ్చేంత వరకు పోరాడాలని గుంటూరు జిల్లా రైతు సంఘం నాయకులు జొన్నా శివశంకరరావు అన్నారు. మంగళవారం దుగ్గిరాల రైలుపేటలో పసుపు వర్తకుల సంఘం భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక ఎకరంలో పసుపు పండించడానికి రూ.రెండు లక్షలు ఖర్చు అవుతోందని, వాతావరణంలో మార్పులు రావడంతో తీవ్రంగా రైతులు నష్టపోతున్నారని, పండించిన పంటకు లక్ష రూపాయలు కూడా ధర రావడం లేదని అన్నారు. బుధవారం దుగ్గిరాల రైలుపేట పసుపు వర్తకుల సంఘంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ సదస్సుకు ప్రతి ఒక్క పసుపు రైతు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వల్లభనేని సాంబశివరావు, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు జెట్టి బాలరాజు, దుగ్గిరాల మండల కార్యదర్శి యార్లగడ్డ బ్రహ్మేశ్వరరావు, మంగళగిరి నియోజకవర్గ రైతు నాయకులు ఆళ్ల సాంబిరెడ్డి, కొర్రపోలు ఈశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని జోలాస్‌నగర్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై తాడేపల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జోలాస్‌నగర్‌లో నివాసముండే బెజ్జంకి బాబు (39) కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో రెండు నెలల కిందట భార్య లక్ష్మి పుట్టింటికి వెళ్లింది. మనస్తాపం చెందిన బాబు తెల్లవారుజామున తాను నివాసముండే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. బాబు మృతిపై బంధువులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఉచిత శిక్షణ

ఫిరంగిపురం: స్థానిక గాలిబాలి మినీ స్టేడియంలో మంగళవారం సీయాప్‌సీ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఫుట్‌బాల్ ఆటలో ఉచిత శిక్షణ కార్యక్రమం రిటైర్డ్ పీడీ హృదయరాజు ప్రారంభించారు. క్రీడాకారులకు కోచ్‌లు వి.నాని, వి.చరణ్‌లు శిక్షణ ఇచ్చారు. 40రోజులపాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, బి.ప్రభుదాసు, ప్రదీప్, ఏసోబు, షరీఫ్, కె.సుబ్బారావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

లాలాపేట పోలీసు స్టేషన్ తనిఖీ చేసిన ఎస్పీ



ఫింగర్ ప్రింట్ పరికరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్, పక్కన సీఐ సుబ్బారావు

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరీఫ్ హాఫీజ్ మంగళవారం లాలాపేట పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో తొలుత పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఐ ఎం.సుబ్బారావును ఆదేశించారు. రాత్రి సమయంలో నైట్ డ్యూటీలు నిర్వహిస్తున్న సిబ్బంది కచ్చితంగా ఫింగర్ ప్రింట్ డివైజ్ పరికరాన్ని వినియోగించుకుని, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకోవాలని సూచించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని ఆదేశించారు. ఎస్పీతో పాటు ఈస్ట్ సబ్ డివిజన్ ఏఎస్పీ నాచికెట్ షెల్కి, ఎస్‌బీ సీఐ నరసింహారావు ఉన్నారు.

వైభవంగా మొగదారమ్మతల్లి ఉత్సవాలు

ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ మోపిదేవి



ఉత్సవాల్లో పాల్గొని, భక్తులను పలకరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు

నిజాంపట్నం: నిజాంపట్నంలో వేంచేసిన శ్రీ మొగదారమ్మతల్లి ఆలయ సిడిమాను మహోత్సవాలు వైభవంగా జరగుతున్నాయి. మత్స్యకారుల ఇలవేల్పు మొగదారమ్మతల్లి ఉత్సవాల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. మంగళవారం జల క్రీడల కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథ బాబు నిజాంపట్నంలోని మొగదారమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ వెంకటరమణారావు మాట్లాడుతూ మొగదారమ్మ తల్లి సిడిమాను ఉత్సవాలను ప్రతి సంవత్సరం అంగరంగ వైభవంగా నిర్వహించకోవడం ఆనవాయితీ అని తెలిపారు. అందుకు సంబందించిన అన్ని ఏర్పాట్లను పూర్తిచేయడం జరిగిందన్నారు.

జలక్రీడలు..

ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక వాహనాలపై నీటిని ఏర్పాటు చేసి గ్రామ వీధుల్లో డప్పు వాయిద్యాలు, మేళ తాళాలతో తిరుగుతూ యువత కోలాహలంగా నీటిని చిమ్ముకుంటూ జల క్రీడలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు నిర్వహించింది.

అన్నదాతకు.. మాజీ జవాను ఆపన్న హస్తం



బాధిత రైతుకు నగదు అందజేస్తున్న కాటి విజయకుమార్

బాపట్ల: మూలపాలేనికి చెందిన మార్పు ఆనందరావుకు చెందిన రెండున్నర ఎకరం వరికుప్ప ఆదివారం అర్ధరాత్రి పిడుగు పడి పూర్తిగా దగ్ధమైంది. సన్నిహితుల ద్వారా విషయం తెలుసుకున్న విశ్రాంత జవాను కె.విజయకుమార్(ఆర్మీ విజయ్) మంగళవారం గ్రామానికి చేరుకొని ఆనందరావుకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి సాగు చేసి ధాన్యం ఇంటికి చేరే తరుణంలో పిడుగు పడి వరికుప్ప దగ్ధమవడం బాధించిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు రైతు సహనం ముందు చిన్నబోతాయన్నారు. బాధిత రైతుకు తన వంతుగా ఎలాంటి సహాయమైన అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులు విజయ్‌ను ఘనంగా సత్కరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గ్రామ పెద్దలతో కలిసి విజయ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లాయర్లు బిళ్లా స్టాన్లీ విమల్ కుమార్, బిళ్లా కమల్ కుమార్, జోగి బుల్లబ్బాయి, గ్రామ పెద్దలు వడ్డిముక్కల మోషే, బెజ్జం రాజు, సాధు వీరయ్య, గొరెముచ్చు వసంత రావు, దక్కుమళ్ల అంకాలు, సునీల్ తదితరులున్నారు.

అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

కమిషనర్ కీర్తి చేకూరి



బిల్డింగ్ ప్లాన్ పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో బహుళ అంతస్తు నిర్మాణాలు నిబంధనలకు అనుగుణంగానే చేపట్టాలని, నిబంధనలు పాటించని వాటికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేయమని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. పెద్ద పలకలూరు రోడ్, గుజ్జనగుండ్ల తదితర ప్రాంతాల్లో ఎన్ఓసీకి దరఖాస్తు చేసుకున్న భవనాలను మంగళవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెట్ బ్యాక్ పోర్షన్ లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరీకి కేటాయింపు ఉండాలని కోరారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలని చెప్పారు. నిర్మాణాలు జరిగే సమయంలోనే వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు నిర్దేశిత అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం నిర్మాణం జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించాలని ఆదేశించారు. ఆమె వెంట డెప్యూటీ సిటీ ప్లానర్ మూర్తి, ఏసీపీ బాబూరావు, టి.పి.ఎస్.లు గోవర్ధన్, హృదయ రాజు పాల్గొన్నారు.


వీధి దీపాల మరమ్మతులకు చర్యలు

నెహ్రూ నగర్: నగరంలో వారం రోజులపాటు వీధి దీపాలపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు, విద్యుత్ లైన్ ఉండి స్తంభాలకు ఉన్న వీధి దీపాలు వెలగని వాటిని వెంటనే పునరుద్ధరించనున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్తంభాలు ఉండి లైట్లు వెలగకుంటే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103, 104 నంబర్లకు లేదా 9849908391 నంబర్‌కు వాట్సాప్ చేయవచ్చని చెప్పారు. క్షేత్ర స్థాయిలోని నగరపాలక సంస్థ లైన్‌మెన్‌లు తమ పరిధిలో వీధి దీపాల పై నివేదిక ఇవ్వాలని, విద్యుత్ విభాగం ఏఈ, డీఈఈ, ఈఈలు పెట్రోలింగ్ చేసి, ప్రజల నుంచి అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని ఆదేశించారు.

పేదల ఇళ్ల స్థలాలను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరులో జిల్లా ట్రైనీ కలెక్టర్ శివనారాయణశర్మ ఆకస్మికంగా పర్యటించారు. మంగళవారం ఆయన మండల సర్వేయర్ నాయక్‌తో కలసి నవులూరులో పేదలకు నివేశన స్థలాలు కేటాయించిన భూములను సందర్శించి జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సాంబశివరావు, గ్రామ సర్వేయర్ స్టాలిన్, వీఆర్ఓ ఆయూబ్ పాల్గొన్నారు.

ఆర్ట్ డైరెక్టర్ జయశేఖరరాజుకు సన్మానం



జయశేఖరరాజుకు సన్మానం

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం పెత్తందార్లు చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం ఛాలెంజ్ రాముడు చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు, చిత్రకారుడు, సినీ ఆర్ట్ డైరెక్టర్ నక్కల జయశేఖర రాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, తాడిశెట్టి వెంకటేశ్వరరావు, దొప్పలపూడి ప్రసాద్, సోమరౌతు శ్రీనివాసరావు, కాలవ బాబురావు, సయ్యద్ షంషుద్దీన్, పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, సోమవరపు సాంబ శివరావు, దేవిశెట్టి భాస్కర్, గుమ్మడి ప్రసాద్, నల్లూరి శ్రీనివాస్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు నియామకానికి నోటిఫికేషన్

తెనాలి: పట్టణ బాలాజీ రావు పేటలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చినట్లు కార్యనిర్వహణాధికారి ఎస్వీఎస్ మల్లేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.